సాక్షి యాదాద్రి భువనగిరి

మంగళవారం । 8 । అక్టోబర్ । 2024



రుణం ఇప్పిస్తామని..

తక్కువ వడ్డీకే ఎక్కువ రుణం ఇప్పిస్తామని మోసం చేస్తున్న ముఠాను నల్లగొండ పోలీసులు అరెస్టు చేశారు. - 10లో



గోదావరితో సస్యశ్యామలం

గోదావరి జలాలతో ఆలేరు నియోజకవర్గం సస్యశ్యామలం అవుతుందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. - 11లో



కుమారుడిని హత్య చేసి..

కుమారుడిని గొంతునులిమి చంపి, తల్లి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనతో కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు. - 12లో

న్యూస్‌రీల్

మూసీ ప్రక్షాళన ఆలస్యం చేయొద్దు

వలిగొండ : జాప్యం చేయకుండా మూసీ ప్రక్షాళన చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం వలిగొండ మండలం వేములకొండలో నిర్వహించిన పార్టీ మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మూసీ జలాలు విషతుల్యమై ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని, ప్రక్షాళన చేయాలని అనేక ఆందోళన కార్యక్రమాలు చేపట్టిన ఘనత సీపీఐదేనని పేర్కొన్నారు. మూసీని త్వరగా ప్రక్షాళన చేసి స్వచ్ఛమైన తాగు, సాగు నీరు అందించాలని కోరారు. సమావేశంలో యానాల దామోదర్ రెడ్డి, బోడ సుదర్శన్, పోలేపాక యాదయ్య, యాస జనార్దన్‌రెడ్డి, సలిగంజి వీరస్వామి, ఎల్లంకి మహేష్, సల్వాద్రి రవీందర్, పులిపలుపుల మల్లేష్,బాలగోని సత్యనారాయణ, అంబటి అంజయ్య, నరిగ యాదయ్య, బత్తుల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో ఆధ్యాత్మిక పర్వాలు



స్వామివారికి నిత్యకల్యాణ వేడుక నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో సోమవారం ఆధ్యాత్మిక పర్వాలు ఆగమశాస్త్ర రీతిలో ఘనంగా నిర్వహించారు. వేకువజామున ప్రధానాలయాన్ని తెరిచిన అర్చకులు.. సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీదళాలతో అర్చించారు. అలాగే ప్రధానాలయ ముఖమండపం, ప్రాకార మండపంలో శ్రీసుదర్శనహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, జోడు సేవోత్సవం, వేద ఆశీర్వచనం, సువర్ణ పుష్పార్చన తదితర పూజలు నిర్వహించారు.

శివాలయంలో..

యాదాద్రికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకం, బిల్వార్చన చేపట్టారు. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

ధరల నియంత్రణలో విఫలం



మాట్లాడుతున్న ఎండీ జహంగీర్

మోత్కూర్ : నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయని, పేదలు ఏమీ కొనలేని పరిస్థితి ఏర్పడిందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ పేర్కొన్నారు. సోమవారం పాలడుగులో పసునూరి చంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన మోత్కూరు మండల మహాసభలో ఆయన మాట్లాడారు.అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు తగ్గినప్పటికీ కేంద్ర ప్రభుత్వం డీజిల్, పెట్రోల్ ధరలు తగ్గించడం లేదన్నారు. తద్వారా అన్ని రకాల వస్తువులపై ప్రభావం పడుతుందన్నారు. జమిలి ఎన్నికల పేరుతో ప్రజల హక్కులను హరించాలని చూస్తుందని, బీజేపీ కుట్రలను తిప్పికొట్టాలని కోరారు. అంతకుముందు కొంపల్లి రామచంద్రు, ముక్కాముల యాదయ్య, బరిగేల శ్రీరాములు, దడిపల్లి లచ్చయ్య నివాళులర్పించారు. సమావేశంలో నాయకులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, బొల్లు యాదగిరి పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

పండుగకైనా వేతనాలివ్వండి

భువనగిరిటౌన్ : పెండింగ్ వేతనాలు దసరాలో పైనా చెల్లించాలని, లేనిపక్షంలో విధులు బహిష్కరిస్తామని గ్రామ పంచాయతీ కార్మికులు హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ.. వేతనాలు చెల్లించకపోవడం వల్ల కార్మికుల కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయన్నారు. వేతనాలు పెంచి క్రమబద్ధీకరిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని కోరారు. ధర్నాలో యూనియన్ రాష్ట్ర మహిళా కన్వీనర్ పొట్ట యాదమ్మ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మండల భిక్షం, గడ్డం ఈశ్వర్, కార్మికులు పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు ధాన్యం

ఊపందుకున్న వరికోతలు.. తెరుచుకోని కొనుగోలు కేంద్రాలు

- వెంటాడుతున్న వర్షం భయం
- మరోవైపు ధాన్యం దిగుమతి చేసుకోబోమని మిల్లర్ల పేచీ
- ఆందోళనలో రైతులు
- ధర తక్కువైనా ప్రైవేట్‌కు అమ్ముకోవడానికే మొగ్గు
- ఇదే అదనుగా ధర తగ్గిస్తున్న వ్యాపారులు



జూలూరులో..



భూదాన్‌పోచంపల్లిలో..

భూదాన్‌పోచంపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో 16, జూలూరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో 8, ఐకేపీ ఆధ్వర్యంలో ఆరు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. పది రోజుల నుంచే కేంద్రాలకు రైతులు ధాన్యం తీసుకురావడం ప్రారంభించారు. ప్రస్తుతం ప్రతి కేంద్రంలో 20 నుంచి 30 మంది రైతుల ధాన్యం ఉంది. కేంద్రాలను తెరవకపోవడంతో ధాన్యాన్ని రోజూ ఆరబెట్టి తూర్పార పడుతున్నారు. దసరా పండుగ తర్వాతనే కేంద్రాలను తెరుస్తామని అధికారులు ప్రకటించడంతో అప్పటి వరకు నిరీక్షించలేక కొందరు ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుంటున్నారు.

సాక్షి, యాదాద్రి : ధాన్యం ప్రైవేట్ మార్కెట్‌కు తరలుతోంది. జిల్లాలో వరికోతలు మొదలై పది రోజులు గడిచినా కొనుగోలు కేంద్రాలను తెరవకపోవడంతో దళారులు, వ్యాపారులకు అన్నదాత ధాన్యం అమ్ముకుంటున్నాడు. ఒకవైపు వానభయం, మరోవైపు వడ్లు దిగుమతి చేసుకోబోమని ఆదిలోనే మిల్లర్లు పేచీ పెట్టడం, గత సీజన్‌లో ఎదురైన అనుభవాలతో వీలైనంత త్వరగా పంటను అమ్ముకునేందుకు ప్రయత్నిస్తున్నారు. క్వింటాకు రూ.200 తక్కువైనా ప్రైవేట్‌కే మొగ్గు చూపుతున్నారు.

దిగుబడి, ధాన్యం సేకరణ లక్ష్యం ఇలా..

ఈ వానాకాలం సీజన్‌లో జిల్లాలో 2,81,885 ఎకరాల్లో వరి సాగైంది. 6,12,790 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఇందులో 4,88,542 మెట్రిక్ టన్నుల ధాన్యం రైతులు విక్రయించే అవకాశం ఉందంటూ పౌరసరఫరాల శాఖకు నివేదిక అందజేశారు. అందుకు అనుగుణంగా జిల్లా వ్యాప్తంగా 323 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సివిల్ సప్లై శాఖ నిర్ణయించింది. కానీ, వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నా ఇప్పటి వరకు ఒక్క కొనుగోలు కేంద్రం కూడా తెరవలేదు. దసరా తరువాత ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు. అప్పటి వరకు వేచి చూడలేక రైతులు ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు.

ధాన్యం దించుకోమంటున్న మిల్లర్లు

జిల్లాలో 51 రైస్ మిల్లులు ఉండగా.. ధాన్యం దిగుమతి చేసుకోబోమని తీర్మానించాయి. ఇటీవల జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో మిల్లుల యజమానులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం కూడా అందజేశారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన సీఎంఆర్, రవాణా, కస్టోడియన్, డ్రైఏజ్, చార్జీల బకాయిలు చెల్లించే వరకు ధాన్యం దిగుమతి చేసుకోబోమని చెప్పారు. అలాగే గడిచిన 25 సంవత్సరాల నుంచి చెల్లిస్తున్న మిల్లింగ్ చార్జీలను పెంచాలని కోరుతున్నారు. హైబ్రిడ్ రకాలతో బాయిల్డ్ రైస్ 68 శాతం, రా రైస్ 67 శాతం బియ్యం ఇవ్వలేమని స్పష్టం చేశారు.

“ వడ్లు తెచ్చి ఐదు రోజులైంది



నాలుగు ఎకరాల్లో వరి వేయగా 350 బస్తాల ధాన్యం దిగుబడి వచ్చింది. ఐదు రోజుల క్రితం జూలూరు కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చాను. ఇంటిల్లిపాదిమి రోజూ వచ్చి ధాన్యాన్ని ఆరబెట్టి తూర్పారపడుతున్నాం. అధికారులేమో మాకు ఆర్డర్ రాలేదు, దసరా తర్వాతనే కొనుగోళ్లు ప్రారంభిస్తామని చెబుతున్నారు. వర్షాలు వస్తాయని ఆందోళనగా ఉంది. త్వరగా కేంద్రాలు ప్రారంభించాలి.

–రుద్ర రాజు, జూలూరు

“ క్వింటాకు రూ.2,030 చెల్లించారు



మూడు ఎకరాల్లో దొడ్డు రకం వరి సాగు చేశాను. ఇటీవల కోత పూర్తయ్యింది. తరచూ వర్షాలు వస్తుండడంతో వడ్లు తడుస్తయన్నా భయంతో ప్రైవేట్‌కు అమ్మిన. క్వింటాకు రూ.2,030 చెల్లించారు. హమాలీ ఖర్చులు, కమీషన్ పోను రూ.70వేల చేతికి అందాయి. ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో విక్రయించాలనుకున్నా. కానీ కేంద్రాలు తెరవకపోవడంతో ప్రైవేట్ వ్యాపారికి అమ్ముకున్న.

–కొత్తపల్లి పెంటయ్య, పల్లెపహాడ్

మొదలైన మిల్లర్ల దోపిడీ..

రైతుల అవసరాలను ఆసరాగా తీసుకుంటున్న మిల్లర్లు ధర తగ్గిస్తున్నారు. ప్రభుత్వం సాధారణ రకానికి క్వింటాకు రూ.2,320 మద్దతు ధర ప్రకటించింది. అయితే తేమ శాతం 20శాతం లోపు ఉంటే రూ.2100 నుంచి రూ.2,130, తేమ 27 శాతం వరకు ఉన్న ధాన్యాన్ని రూ.2,000 నుంచి రూ.2,050 వరకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో పాటు బస్తాకు రెండు కిలోల తరుగు, రెండు శాతం కమీషన్, హమాలి బస్తాకు రూ.25, ట్రాక్టర్ వడ్లకు కాంటా హమాలీ రూ.200 కట్ చేస్తున్నారు. దీంతో పాటు గుమస్తా మామూలు, కాంటా మామూలు వసూలు చేస్తున్నారు. రెండు శాతం కమీషన్ తీసుకున్నా 15 రోజులైనా డబ్బులు ఇవ్వడం లేదు.



ఆత్మకూర్ (ఎం) మండలంలో ప్రైవేట్ వ్యాపారికి ధాన్యం విక్రయిస్తున్న రైతు

చేపలు పట్టుకునేందుకు అనుమతించండి

- కలెక్టర్‌కు రాళ్లజనగాం మత్స్య సొసైటీ సభ్యుల వినతి



కలెక్టరేట్‌కు వచ్చిన రాళ్లజనగాం మత్స్యసొసైటీ సభ్యులు

భువనగిరిటౌన్ : బస్వాపురం రిజర్వాయర్‌లో భూములు, ఇళ్లు కోల్పోయామని, ప్రాజెక్టులో చేపలు పట్టేందుకు తమకు అవకాశం కల్పించాలని యాదగిరిగుట్ట మండలం రాళ్లజనగాం మత్స్యపారిశ్రామిక సహకార సంఘం మార్కెటింగ్ సొసైటీ సభ్యులు కోరారు. ఈ మేరకు వారు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామస్తుల నుంచి 220 ఎకరాల సాగు భూములు రిజర్వాయర్ కోసం తీసుకున్నారని, ప్రస్తుతం ఎలాంటి జీవనోపాధి లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. కూలి పనులకు వెళ్తూ కుటుంబాలను పోషించుకుంటున్నామని తెలిపారు. సంఘంలో 88 మందికి సభ్యత్వం ఉందని, అందరికీ చేపలు పట్టుకునే అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు సత్యనారాయణ, దేవశేఖర్, లక్ష్మణ్, నర్సింహులు, జిలవిష్ణు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత భద్రత, ఆత్మరక్షణపై అవగాహన

బీబీనగర్ : బీబీనగర్‌లోని ఎయిమ్స్ వైద్య కళాశాలలోని ఎంబీబీఎస్, నర్సింగ్ విద్యార్థులు, వైద్యులకు వ్యక్తిగత భద్రత, ఆత్మరక్షణకు తీసుకోవాల్సిన వ్యూహాలు, చిట్కాలపై రాచకొండ షీటీం బృందం సోమవారం అవగాహన కల్పించింది. ఎవరైనా దాడి చేసినప్పుడు తప్పించుకోవడానికి అనుసరించాల్సిన వ్యూహాల గురించి వివరించారు. అలాగే వ్యక్తిగత భద్రత కోసం సేఫ్టీ ట్రాకింగ్ యాప్ వినియోగించే విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా, ప్రొఫెసర్లు, అడిషనల్ ప్రొఫెసర్లు మృదుల, అపర్ణ, శ్యామల లియర్, లక్ష్మీజ్యోతి, అసోసియేట్ ప్రొఫెసర్ కల్పన పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యం

- కలెక్టర్ హనుమంతు కే.జెండగే



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

భువనగిరిటౌన్ : ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు బెన్ షాలోమ్, గంగాధర్, జెడ్పీ సీఈఓ శోభారాణి, ఇతర జిల్లా అధికారులతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వాటిని పరిశీలించి సంబంధిత శాఖలకు రెఫర్ చేశారు. ప్రజావాణికి సుదూర ప్రాంతాల నుంచి వస్తుంటారని, వారిచ్చే అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని పేర్కొన్నారు. కాగా వివిధ సమస్యలపై మొత్తం 39 అర్జీలు రాగా అత్యధికంగా రెవెన్యూ సమస్యలకు సంబంధించి 20 అర్జీలు ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు.

వినతులు ఇలా..

- బస్వాపురం ప్రాజెక్టు నిర్మాణంలో భూములు, ఇళ్లు కోల్పోయామని, ప్రాజెక్టులో చేపలు పట్టేందుకు తమను అనుమతించాలని యాదిగిరిగుట్ట మండలం బాలాజీనగర్‌కు చెందిన ముదిరాజు కులస్తులు విన్నవించారు.
- వలిగొండ మండలం వెంకటాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నాడని, అతన్ని బదిలీ చేయాలని కోరుతూ గ్రామానికి చెందిన కొత్త వెంకటేశం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.
- డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించాలని బీబీనగర్‌కు చెందిన లబ్ధిదారులు విన్నవించారు.
- వరిచేలు కోతకు వచ్చినందున ఆసిఫ్‌నహర్ కాలువ నీటిని వెంటనే నిలిపివేయాలని రామన్నపేట మండలంలోని దుబ్బాక, మునిపంపుల, పల్లివాడ, ఎన్నారం గ్రామాల రైతులు ప్రజావాణిలో విజ్ఞప్తి చేశారు.

సర్వే పక్కాగా ఉండాలి




సర్వే వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్

యాదగిరిగుట్ట రూరల్ : ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే ఆదేశించారు. యాదగిరిగుట్ట మండలం జంగంపల్లిలో నిర్వహిస్తున్న సర్వేను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబంలోని ప్రతి సభ్యుడి వివరాలు సేకరించాలని బృందాలకు సూచించారు. పొరపాట్లకు తావులేకుండా వివరాలు సేకరించాలని, ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకోవాలని పేర్కొన్నారు. కాగా గ్రామంలో 186 కుటుంబాల సర్వే పూర్తయినట్లు అధికారులు కలెక్టర్‌కు తెలిపాయి. కార్యక్రమంలో ఎంపీడీఓ నవీన్‌కుమార్, ఎంపీఓ సలీం, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు ముందే దసరా

9న నియామక పత్రాలు

- హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అందజేత
- నేడు మెరిట్ జాబితా విడుదల
- జిల్లా నుంచి ఆరు బస్సుల్లో అభ్యర్థులను తరలించాలని డీఈఓకు ఆదేశాలు



భువనగిరి : డీఎస్సీ–2024 అభ్యర్థుల్లో జోష్ నెలకొంది. ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన వారికి దసరా కానుకగా పండుగకు మూడు రోజుల ముందే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేయనున్నారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ స్టేడియం వేదిక కానుంది. ఇందుకు సంబంధించి డీఈఓలకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందడంతో అభ్యర్థుల మెరిట్ లిస్టు తయారీలో నిమగ్నం అయ్యారు. మంగళవారం మెరిట్ జాబితాను విడుదల చేయనున్నారు. ఎంపికైన అభ్యర్థులను హైదరాబాద్‌కు తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ముందుగా స్కూల్ అసిస్టెంట్ల జాబితా..

ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను మంగళవారం వెల్లడించేందుకు విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. తొలుత స్కూల్ అసిస్టెంట్లు, ఆ తరువాత ఎస్‌జీటీల జాబితాలను ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఎవరైనా స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీ రెండు పోస్టులకు ఎంపికైతే స్కూల్ అసిస్టెంట పోస్టు ఇచ్చి ఎస్జీటీ జాబితా నుంచి సదరు అభ్యర్థి పేరు తొలగించనున్నారు. దీంతో ఎస్జీటీ పోస్టుకు రెండో స్థానంలో ఉన్న అభ్యర్థిని ఎంపిక చేయనున్నారు. దీని వల్ల బ్యాక్‌లాగ్ పోస్టులు లేకుండా చూడవచ్చని అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. జాబితా ప్రకటించిన తర్వాత ఎంపికైన అభ్యర్థులకు ఈమెయిల్ లేదా ఫోన్ ద్వారా 8న సమాచారం ఇవ్వనున్నారు.

కలెక్టరేట్ వద్ద నుంచి ప్రత్యేక బస్సులు

లాల్‌బహదూర్ స్టేడియంలో ఈనెల 9న సీఎం చేతులమీదుగా జారీ చేసే నియామక పత్రాల జారీ కార్యక్రమానికి జిల్లానుంచి ఆరు బస్సుల్లో అభ్యర్థులను తరలించనున్నారు. ఒక్కో బస్సులో కానిస్టేబుల్, సమన్వయ అధికారి ఉంటారు. కలెక్టరేట్ వద్ద నుంచి బస్సులు బయలుదేరుతాయి.

“ లిస్టు రాగానే సమాచారం ఇస్తాం



అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించి వివరాలను డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్‌కు పంపాం. అక్కడి నుంచి మెరిట్ లిస్టు రాగానే అభ్యర్థులకు సమాచారం ఇస్తాం. నేడు జాబితా వచ్చే అవకాశం ఉంది. ఎంపికైన అభ్యర్థులు నియామక పత్రాల కోసం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియం వెళ్లాల్సి ఉంటుంది.

–సత్యనారాయణ, డీఈఓ

277 పోస్టులు భర్తీ

జిల్లాలో 277 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనున్నారు. అన్ని కేటగిరీలకు సంబంధించి ఎస్‌జీటీ 158, స్కూల్ అసిస్టెంట్ 119 పోస్టులు ఉన్నాయి. జిల్లాలో 712 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 3,497 మంది ఉపాధ్యాయులు ఉండాలి. ప్రస్తుతం 2,761 మంది పనిచేస్తున్నారు. డీఎస్సీ–2024 ద్వారా 277 పోస్టులు భర్తీ కానుండడంతో వారి సంఖ్య 3,038కి చేరనుంది. దీంతో పాటు డీఎస్సీ –2008 అభ్యర్థులు 391 మంది కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉమ్మడి జిల్లాకు నియామకం అయ్యారు. వీరిలో కొంతమంది జిల్లాకు రానున్నారు. దీంతో ఉపాధ్యాయుల కొరత కొంతమేరకు తగ్గనుంది.

లక్ష్మీదేవిగా దుర్గామాత



దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా యాదాద్రి శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శ్రీలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన దుర్గామాత

ప్రభుత్వ నిధులు ‘దారి’మళ్లింపు!

ప్రైవేట్ వెంచర్‌లో రోడ్డు నిర్మాణం

- బిల్లు డ్రా చేసేందుకు ప్రయత్నాలు
- ఓ ప్రజాప్రతినిధి పీఏతో మున్సిపల్ కమిషనర్‌పై ఒత్తిడి
- ఆలస్యంగా వెలుగులోకి



ఓ కౌన్సిలర్ తనకు కేటాయించిన ప్రభుత్వ నిధులతో తన వెంచర్‌లో వేసిన సీసీ రోడ్డు

మోత్కూర్ : ప్రభుత్వ నిధులు అభివృద్ధికి వినియోగించకుండా పక్కదారి పట్టిస్తున్నారు.. కొందరు ప్రజాప్రతినిధులు. తమ పలుకుబడిని ఉపయోగించి వ్యక్తిగత ప్రయోజనాలకు వాడుకుంటున్నారు. మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలో ఓ కౌన్సిలర్ ప్రైవేట్ వెంచర్‌లో రోడ్డు వేయడం, బిల్లు డ్రా చేసేందుకు విశ్వప్రయత్నాలు చేస్తుండడం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

ఏం జరిగిందంటే..

మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని 12 వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీయూఎఫ్ఐడీసీ) ద్వారా రూ.4 కోట్లు 80లక్షలు విడుదల చేసింది. ఈ నిధులను ఒక్కో వార్డుకు రూ.40లక్షల చొప్పున కేటాయించారు. వీటిలో రూ.20 లక్షలతో సీసీ రోడ్లు, రూ.20 లక్షలతో మురుగు కాల్వల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ప్రస్తుతం అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీల పనులు జరుగుతున్నాయి. అయితే ఓ కౌన్సిలర్ తనకే కేటాయించిన ఫండ్‌తో తన వార్డులో పనులు చేయాల్సింది పోయి అందులో రూ.25 లక్షల వరకు దారి మళ్లించాడు. మరో వార్డులో తాను సొంతంగా ఏర్పాటు చేసిన వెంచర్‌లో 300 మీటర్ల మేర సీసీ రోడ్డు వేసేందుకు వాటిని వాడుకున్నాడు. అక్కడ నివాసగృహాలు అసలే లేవు. బిల్లు కోసం మున్సిపల్ పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారులకు ఫైల్ పెట్టగా నిరాకరించినట్లు తెలిసింది. ఏదో విధంగా బిల్లు డ్రా చేసేందుకు ప్రయత్నిస్తున్న సదరు కౌన్సిలర్.. ఓ ప్రజాప్రతినిధి పీఏతో మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేయించి ఒత్తిడి చేయిస్తున్నట్లు సమాచారం. సీసీ రోడ్లు, డ్రెయినేజీలు లేని వీధులు ఉన్నప్పటికీ అక్కడ కాకుండా తన వెంచర్‌లో సీసీ రోడ్డుకు ఎలా ఖర్చు చేస్తాడని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం కాకుండా వెంచర్‌లో నిర్మించిన సీసీ రోడ్డు బిల్లు నిలిపివేయాలని కోరుతూ అధికార పార్టీకి చెందిన నాయకులు జినుకల కనకయ్య, పల్లపు సమ్మయ్య, మందుల సురేష్ ఇటీవల మున్సిపల్ కమిషనర్‌కు కూడా వినతిపత్రం అందజేశారు.

“ సీసీ రోడ్డు వేసింది వాస్తవమే



ప్రైవేట్ వెంచర్‌లో ఓ కౌన్సిలర్ సీసీ రోడ్డు వేసింది వాస్తవమే. సుమారు 300 మీటర్ల మేర వేసిన సీసీ రోడ్డుకు రూ.25 లక్షలు బిల్లు అవుతుంది. ఓ ప్రజాప్రతినిధి పీఏ నుంచి కూడా బిల్లుకోసం ఫోన్ చేయించాడు. నివాస గృహాలు లేని ప్రైవేట్ వెంచర్లలో ప్రభుత్వ నిధులతో వేసిన రోడ్డుకు బిల్లు ఇవ్వబోమని చెప్పాం. కాంట్రాక్టర్‌కు బిల్లు ఆపాం. రోడ్డుతో మున్సిపాల్టీకి ఎలాంటి సంబంధం లేదు.

–సి.శ్రీకాంత్, మోత్కూరు మున్సిపల్ కమిషనర్

“ వెంచర్ రోడ్డుకు, మున్సిపాలిటీకి సంబంధం లేదు

ప్రైవేట్ వెంచర్‌లో టీయూఎఫ్ఐడీసీ నిధులు ఖర్చు చేసి కౌన్సిలర్ సీసీ రోడ్డు వేసిన విషయం తమ దృష్టికి వచ్చింది. ప్రైవేట్ వెంచర్‌లో వేసిన రోడ్డుతో, మా శాఖకు ఎలాంటి సంబంధం లేదు.దానికి బిల్లు చెల్లించబోమని ఇప్పటికే స్పష్టం చేశాం. పట్టణ అభివృద్ధికి కోసం కేటాయించిన నిధులు ప్రజల అవసరాల కోసం ఖర్చు చేయాలి.

–సురేష్, ఏఈ, పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్

“ విచారణ జరపాలి



సీసీ రోడ్లు, మురుగు కాల్వలకు కేటాయించిన ప్రభుత్వ నిధులను కౌన్సిలర్ దుర్వినియోగం చేశాడని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రైవేట్ వెంచర్‌లో ప్రభుత్వ నిధులతో వేసిన సీసీ రోడ్డుపై. బిల్లు చెల్లించే ప్రయత్నంపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేయాలి. మున్సిపల్ కమిషనర్ తక్షణమే స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలి.

–పల్లపు సమ్మయ్య, మోత్కూరు

క్లుప్తంగా

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

బీబీనగర్: కుటుంబ సమస్యలతో మానసిక ఒత్తిడికి లోనైన యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బీబీనగర్ మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో ఆదివారం రాత్రి జరిగింది. సోమవారం ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లాలోని బిచ్కుంద గ్రామానికి చెందిన జిరిగె సునీల్‌కుమార్(34) బీబీనగర్ మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో అద్దెకు ఉంటూ స్థానికంగా మాజీ ఎంపీటీసీకి చెందిన ఫాంహౌజ్‌లో కూలీగా పనిచేస్తున్నాడు. కుటుంబ సమస్యల కారణంగా సునీల్‌కుమార్ మానసిక ఒత్తిడికి లోనై ఆదివారం రాత్రి అద్దె ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి అన్న సంజీవ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం


పెదబీరయ్య

గుండాల: మండలంలోని మాసాన్‌పల్లి గ్రామానికి చెందిన కేమిడి పెదబీరయ్య కనిపించడం లేదని అతడి కోడలు అనిత సోమవారం గుండాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ నెల 4వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన పెదబీరయ్య హైదరాబాద్‌కు వెళ్తున్నట్లు పక్కింటి వారికి చెప్పాడని, నాలుగు రోజులుగా ఎంత వెతికినా అతడి జాడ తెలియలేదని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సెల్‌ఫోన్లు అప్పగింత

గరిడేపల్లి: మండలంలోని కల్మలచెర్వు, కాల్వపల్లి గ్రామాలకు చెందిన అనంతు ప్రమీల, తడకమల్ల పవీణ్, కొల్లి ఆశీర్వాదం తమ సెల్‌ఫోన్లు పోయాయని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ యాప్ ద్వారా సెల్‌ఫోన్లను కనిపెట్టి సోమవారం గరిడేపల్లి పోలీస్ స్టేషన్‌లో వారికి అప్పగించినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

తక్కువ వడ్డీకే రుణం ఇప్పిస్తామని కుచ్చుటోపీ

- రైతుల నుంచి డబ్బులు వసూలు చేసిన ముఠా సభ్యులు
- ఏడుగురి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్, చిత్రంలో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు తదితరులు


స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్లు, సెల్‌ఫోన్లు

నల్లగొండ క్రైం: బ్యాంకు అధికారులమంటూ రైతులను నమ్మించి తక్కువ వడ్డీకే ఎక్కువ రుణం ఇప్పిస్తామని మోసం చేస్తున్న ఏడుగురు ముఠా సభ్యులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సోమవారం నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తన కార్యాలయంలో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజుతో కలిసి విలేకరులకు వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం .. పెద్దవూర మండలం వెలుగుగూడెం గ్రామానికి చెందిన కట్టెబోయిన పరమేష్, తెప్పలమడుగుకు చెందిన పల్లెబోయిన నాగరాజు అలియాస్ నాగార్జున, మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెంకు చెందిన మమ్ముల జ్యోతిస్వరూప్ అలియాస్ మణి అలియాస్ రాజేష్, నార్కట్‌పల్లి మండలం లింగోటం గ్రామానికి చెందిన షేక్ వజీర్, నార్కట్‌పల్లి గ్రామానికి చెందిన ముప్పిడి సైదులు, మాడ్గులపల్లి మండలం చిరుమర్తి గ్రామానికి చెందిన కొండా శ్రీను అలియాస్ శ్రీనివాస్, మిర్యాలగూడ పట్టణంలోని బాపూజీనగర్‌కు చెందిన గోగుల సురేష్ అలియాస్ రమేష్, మిర్యాలగూడ మండలంలోని జప్తివీరప్పగూడెం గ్రామానికి చెందిన చిలుముల సైదులు కలిసి ముఠాగా ఏర్పడి బ్యాంకు అధికారులుగా, ఫీల్డ్ ఆఫీసర్లుగా చెలామణి అవుతూ తక్కువ వడ్డీకి ఎక్కువ రుణం ఇప్పిస్తామని రైతులను నమ్మించారు. నల్లగొండ జిల్లాలోని పెద్దవూర, తిరుమలగిరి(సాగర్), నిడమనూరు, నేరడుగొమ్ము, దేవరకొండ, పెద్దఅడిశర్లపల్లి మండలాల్లోని 28 మంది రైతుల నుంచి పట్టాదారు పాసుపుస్తకాలు, ఆన్‌లైన్ పహానీలు, రుణం పొందేందుకు కావల్సిన అన్ని ధ్రువపత్రాలను సేకరించి ఒక్కో రైతు నుంచి రూ.80వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేశారు. ఏడాది కాలంగా ఈ ముఠా సభ్యులు రైతులను మోసగిస్తూ డబ్బులు వసూలు చేసి తమ చిరునామా మారుస్తూ తప్పించుకుంటున్నారు. పలువురు రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులకు నిందితులను వారి నివాసాల్లో అరెస్ట్ చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. నిందితుల నుంచి రూ.1.65లక్షల నగదు, పలు డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను పట్టుకున్న మిర్యాలగూడ డీఎస్పీరాజశేఖర్‌రాజు, నాగార్జునసాగర్ సీఐ భీసన్న, పెద్దవూర ఎస్ఐ వీరబాబు, పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

అక్రమంగా నిల్వచేసిన బియ్యం పట్టివేత


శ్రీరేణుకా ఎల్లమ్మ ఫ్యామిలీ దాబాలో అక్రమంగా నిల్వ చేసిన బియ్యం

చివ్వెంల(సూర్యాపేట): మండల పరిధిలోని దురాజ్‌పల్లి గ్రామ శివారులో ఓ దాబాలో అక్రమంగా నిల్వచేసిన 800 బస్తాల బియ్యాన్ని సోమవారం పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూర్(ఎస్) మండలం కోటినాయక్ తండాకు చెందిన శేషులాల్ చివ్వెంల మండలం దురాజ్‌పల్లి గ్రామ శివారులో మూతపడిన శ్రీరేణుకా ఎల్లమ్మ ఫ్యామిలీ దాబాను కిరాయికి తీసుకున్నాడు. బియ్యం వ్యాపారి అయిన శేషులాల్ ఈ దాబా నుంచి వేరే ప్రాంతాలకు డీసీఎంలలో బియ్యాన్ని తరలిస్తున్నాడు. సోమవారం డీసీఎంలో బియ్యం లోడ్ వేస్తుండగా కొంతమంది గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ వెంకట్‌రెడ్డి తన సిబ్బందితో దాబా వద్దకు చేరుకుని బియ్యాన్ని పరిశీలించారు. కాగా ఎఫ్‌సీఐ తిరస్కరించిన బియ్యాన్ని తాను కొనుగోలు చేసి వాటిని నూకలుగా చేసి కోళ్లఫాంలకు విక్రయిస్తున్నట్లు వ్యాపారి తెలుపడంతో అతడిని అదుపులోకి తీసుకున్నారు. 800 బస్తాల బియ్యాన్ని సీజ్ చేసి, బియ్యంలో కలిపేందుకు డీసీఎంలో తీసుకొచ్చిన తెల్ల కంకర పొడి బస్తాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు సివిల్ సప్లై, టాస్క్‌ఫోర్స్ అధికారులకు సమాచారం అందించడంతో వారు సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. పట్టుబడిన బియ్యం రేషన్ బియ్యం కాదని వారు నిర్ధారించి చెప్పడంతో కొన్ని శాంపిల్స్‌ను హైదరాబాద్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

చిరుధాన్యాలతో ఉత్పత్తుల తయారీపై శిక్షణ


మహిళలకు శిక్షణ ఇస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

గరిడేపల్లి: చిరుధాన్యాలతో ఉత్పత్తులు తయారు చేసి మహిళలు స్వయం ఉపాధి పొందవచ్చని గరిడేపల్లి మండలం గడ్డిపల్లిలో గల కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) శాస్త్రవేత్త ఎన్. సుగంధి అన్నారు. చిరుధాన్యాలతో ఉత్పత్తుల తయారీపై గడ్డిపల్లి కేవీకేలో ఐదు రోజుల పాటు ఇవ్వనున్న శిక్షణను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. చిరుధాన్యాలైన రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు మొదలగు వాటితో రాగి లడ్డు, జొన్న లడ్డు, జొన్న మురుకులు, చెక్కలు మరియు బేకరీ ఉత్పత్తులను తయారు చేయడంపై ప్రాక్టికల్ సెషన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. మహిళలు చిరుధాన్యాల ఉత్పత్తులను ఆహారంలో భాగంగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు నరేష్, ఆదర్శ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

రాజాపేట: మండలంలోని బొందుగుల గ్రామంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా అక్కారం గ్రామానికి చెందిన ప్రశాంత్ బైక్‌పై రాజాపేట మండలం బొందుగుల గ్రామం మీదుగా స్వగ్రామానికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అతడిని రాజాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

శ్రీలక్ష్మీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు


అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట: యాదాద్రి ఆలయానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. 5వ రోజైన సోమవారం అమ్మవారిని శ్రీలక్ష్మీదేవిగా అలంకరించారు. అనంతరం అమ్మవారికి సంప్రదాయంగా పూజలు జరిపించారు. ఉదయం ప్రాతఃకాల పూజ, అర్చనలు, పారాయణములు, గాయత్రీ జపములు, సహస్రనామార్చన, మధ్యాహ్న పూజ నిర్వహించారు. సాయంత్రం 7.30గంటల నుంచి నవావరణ పూజ, మంత్ర పుష్పములు, తీర్థ ప్రసాదం వినియోగం చేపట్టారు.

ఖాతాదారులకు నాణ్యమైన సేవలు అందిస్తున్నాం


బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేస్తున్న పోచంపల్లి బ్యాంకు చైర్మన్ తడక రమేశ్

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో ఖాతాదారులకు నాణ్యమైన సేవలందిస్తూ వారి మన్ననలు పొందుతున్నామని బ్యాంకు చైర్మన్ తడక రమేశ్ అన్నారు. ఇటీవల విద్యుదాఘాతంతో మృతిచెందిన పోచంపల్లి పట్టణ కేంద్రానికి చెందిన కప్పెర వెంకటయ్యతో పాటు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మహేశ్వరం దత్తాత్రేయకు జీపీఏ పాలసీ కింద ఒక్కో కుటుంబానికి మంజూరైన రూ.లక్ష బీమా చెక్కులను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 10 నుంచి 70 సంవత్సరాల వయస్సు ఉన్న ప్రతి బ్యాంకు ఖాతాదారుడికి బీమా వర్తిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు సీఈఓ సీత శ్రీనివాస్, వైస్ చైర్మన్ భారత రాజేంద్రప్రసాద్, డైరెక్టర్లు కర్నాటి బాలసుబ్రమణ్యం, ఏలే హరిశంకర్, సూరెపల్లి రమేష్, రాపోలు వేణు, గుండు కావ్య, కర్నాటి భార్గవి, కొండమడుగు ఎల్లస్వామి, మక్తాల నర్సింహ, బిట్టు భాస్కర్, సీనియర్ మేనేజర్ రాచకొండ మధుసూదన్, బ్రాంచ్ మేనేజర్ రచ్చ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పురాతన శిలాశాసనాల పరిశీలన


వెల్మజాలలో శిలాశాసనాలను పరిశీలిస్తున్న రత్నాకర్‌రెడ్డి

గుండాల: మండలంలోని వెల్మజాల గ్రామంలోని శివుని బండపై గల శిలాశాసనాలను భారత పురావస్తు శాఖ డైరెక్టర్ రత్నాకర్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ శిలాశాసనాలపై 13, 14వ శతాబ్దానికి చెందిన వీరులు దేవుడి మొక్కు కోసం జుట్టు పెంచి సిగ ముడివేసి మూడు పాయలుగా జుట్టు విడదీసి జడ అల్లినట్లుగా తెలుస్తుందని తెలిపారు. వీరుల శిల్పాలను వీరుగల్లులు అంటారని చెప్పారు. అనంతరం రణరంగంలో గ్రామ రక్షణ కోసం కడదాక నిలిచి ప్రాణాలు పోగొట్టుకున్న వీరుల శిల్పాలను కనుగొన్నట్లు పేర్కొన్నారు. 13, 14వ శతాబ్దపు శాసనంలో కలబడు అక్షరాలు ఉన్నాయని చెప్పారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ దాస సుబ్రహ్మణ్యప్రసాద్, సుధీర్, వినోద్‌కుమార్ ఉన్నారు.

‘కంది’లో చీడపీడలు - నివారణ చర్యలు


కంది పంట

నడిగూడెం: ప్రస్తుతం సాగులో ఉన్న కంది పంట ఏపుగా పెరిగే దశలో ఉంది. ఈ దశ నుంచి కందిపై చీడపీడలు ఆశించి నష్టపరుస్తుంటాయి. ఈ సమయంలో రైతులు సరైన సస్యరక్షణ చర్యలు తీసుకుంటే అధిక దిగుబడి పొందవచ్చని నడిగూడెం మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి దేవప్రసాద్ చెబుతున్నారు. చీడపీడల నివారణపై ఆయన సలహాలు, సూచనలు..

ఆశించే పురుగులు

ఆకు గూడు పురుగు : ఈ పురుగు ఎదుగు దశలో, ఒక్కోసారి పూత దశలో కూడా ఆశిస్తుంది. లార్వాలు చిగురాకులను, ఆకులను గూడుగా చేసి, లోపల ఉండి ఆకులను తింటాయి. ఒక్కోసారి పువ్వులను, లేత కాయలను కూడా తింటాయి. అధిక వర్షపాతం నమోదైనప్పుడు పంట ఎదుగు దశల్లో ఎక్కువగా ఆశిస్తుంది.

నివారణ: మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా క్వినాల్‌ఫాస్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పూత పెంకు పురుగు : ఎర్రటి లేదా నారింజ రంగు మచ్చలు, గీతలున్న నల్లటి పూత పెంకు పురుగులు కందిని పూత దశలో ఆశించి, మొగ్గలను తినడం వలన కాత శాతం తగ్గిపోతుంది. పూత సమయంలో మేఘావృతమైన వాతావరణ పరిస్థితులలో వస్తుంది. ఈ పురుగులను నివారించాలంటే ఉదయం పూట పురుగులను ఏరి నాశనం చేయాలి.

మారూకా మచ్చల పురుగు : తల్లి రెక్కల పురుగు కోడి గుడ్డు ఆకారం గల పసుపు పచ్చని గుడ్లని పూమొగ్గలపై లేత ఆకులపై, పిందెలపై పెడుతుంది. గుడ్ల నుండి వెలువడిన లార్వాలు ఆకులను, పువ్వులను, కాయలను కలిపి గూళ్లుగా చేసి, మొగ్గలను, పిందెలను, కాయలను తొలిచి తింటాయి. తొలిచిన కాయ రంధ్రం దగ్గర లార్వా విసర్జితములు కనిపిస్తాయి.

నివారణ : క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. ప్రొఫెనాఫాస్ 2 మి.లీ. లేదా నొవాల్యురాన్ 0.75 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు స్పైనోసెడ్ 0.3. మి.లీ. లేదా ఎమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములు నీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పాడి-పంట

శనగపచ్చ పురుగు : తల్లి పురుగు లేత చిగుళ్లపై, పూ మొగ్గలపై, లేత పిందెలపై విడివిడిగా లేత పసుపు రంగు గుడ్లను పెడుతుంది. గుడ్ల నుండి వెలువడిన నార పురుగులు మొగ్గల్ని గోకి తింటూ తర్వాత దశలో మొగ్గల్ని గోకి తింటూ తరువాత దశలో మొగ్గల్ని తొలిచి కాయలోకి తలను చొప్పించి మిగిలిన శరీరాన్ని బయటకు ఉంచి లోపల గింజలను తిని డొల్ల చేస్తాయి. పురుగు తిన్న కాయకి గుండ్రని రంధ్రాలు కనిపిస్తాయి.

నివారణ : ఫ్లూబెండమైడ్ 0.2 మి.లీ. లేదా ల్యామ్డాసైహాలోత్రిన్ 1 మి.లీ. లేదా థయోడికార్బ్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

ఆశించే తెగుళ్లు

ఎండు తెగులు : ఈ తెగులు సోకిన మొక్కలు పూర్తిగా కాని, మొక్కలో కొంత భాగం కానీ వాడి ఎండిపోతాయి. ఎండిన మొక్కలను పీకి కాండం మొదలు భాగం చీల్చి పరిశీలిస్తే గోధుమ వర్ణపు నిలువు చారలు కనిపిస్తాయి. ఇది భూమిలో ఉండే శిలీంధ్రం ద్వారా వ్యాపిస్తుంది.

నివారణ : ఈ తెగులు నివారణకు మందులు లేవు. కాబట్టి తెగులును తట్టుకొనే రకాలు ఐసీపీఎల్-87119 లేదా ఐసీపీ 8868, డబ్ల్యూఆర్-97, డబ్ల్యూఆర్-93 రకాలను సాగు చేసుకోవాలి. ట్రైకోడెర్మా మిశ్రమం 10 గ్రాములు ఒక కిలో విత్తనాలకు కలిపి విత్తుకోవడం వలన కొంత వరకు ఎండు తెగులును నివారించవచ్చు.

ఫైటోఫ్తోరా ఎండు తెగులు : దీని ఆకులు, కొమ్మలు, కాండంపై నీటి చుక్కల మాదిరిగా ఏర్పడి తరువాత గోదుమ రంగుకు మారతాయి. తెగులు తీవ్రమైనచో కొమ్మలు, కాండం విరిగిపోతాయి. తొలిదశలో వచ్చినప్పుడు గుంపులు గుంపులుగా మొక్కలు ఎండిపోతాయి. ఈ తెగులు అధిక వర్షపాతం, నీరు నిలువ ప్రాంతాలలో ఎక్కువగా వస్తుంది. పైరు ఎదుగుదల దశల అధిక వర్షపాతము నమోదై, మురుగు నీరు పోయే వసతి సరిగ్గా లేని ప్రాంతాలలో ఎక్కువ వస్తుంది.

నివారణ : మాంకోజెబ్ 3 గ్రాములు లేదా మెటలాక్సిల్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదా మొక్క మరియు వాటి చుట్టూ ఉన్న మొక్కలు బాగా తడిసేలా పిచికారీ చేయాలి.

స్టెరిలిటీ మొజాయిక్ తెగులు : ఈ తెగులు సోకిన మొక్క లేత ఆకుపచ్చరంగు గల చిన్న ఆకులను విపరీతంగా తొడుగుతుంది. పూత పూయదు. ఈ తెగులు నల్లి ద్వారా వ్యాపిస్తుంది. బెట్ట వాతావరణ పరిస్థితులు అనుకూలం. ఆలస్యంగా విత్తిన కంది పంటలో ఎక్కువగా ఆశిస్తుంది.

నివారణ : గంధకపు పొడి 3గ్రాములు లీటరు నీటికి లేదా డైకోఫాల్ 4 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. తట్టుకొనే రకాలైన ఐసీసీఎల్-87119, ఐసీసీఎల్ 8506 రకాలను సాగు చేసుకోవాలి.

- వేసవిలో లోతైన దుక్కులు చేయాలి.
- ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలు అమర్చాలి.
- ఎకరానికి 8 నుండి 10 పక్షి స్థావరాలు ఏర్పాటు చేయాలి.
- బంతి పూల మొక్కలను ఎర పంటగా వేయాలి.

కెనడాలో బతుకమ్మ వేడుకలు



కెనడా దేశంలోని ఒంటారియో రాష్ట్రం బ్రాంట్‌ఫోర్డ్ సిటీలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన పలువురు మహిళలు తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకుంటున్నారు. ది గ్రేటర్ బ్రాంట్‌ఫోర్డ్ సిటీ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో మేళ్లచెరువు, హుజూర్‌నగర్, ఖమ్మం తదితర ప్రాంతాలకు చెందిన నళిని, విజయ, జోత్స్న, పద్మ తదితరులు తమ ఇళ్ల వద్ద రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఒక్క చోట చేరి ఆడిపాడారు. – హుజూర్‌నగర్